సాక్షి
ఒడిశా
బుధవారం । 4 । జనవరి । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,00,485
బంగారం	150 మిల్లీ గ్రాములు
వెండి	28 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

మరో రష్యన్ మృతి



- 8లో



ప్లాస్టిక్ గన్‌తో డాక్టర్‌కు బెదిరింపులు

- 8లో

న్యూస్‌రీల్

మహారాణికి నివాళులు



మహారాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నందపూర్ వాసులు

జయపురం: మహారాణి స్వర్గీయ రమాకుమారి దేవికి నందపూర్ ప్రజలు సంతాపం తెలియజేశారు. నందపూర్‌లో ఉన్న మహారాజుల 32 మెట్ల సింహాసనం ప్రాంగణంలో నిర్వహించిన సంతాప సభ సమితి బీడీవో ఉజిత్ కుమార్ మిశ్రా అధ్యక్షతన జరిగింది. విద్యావంతులు, ఆనాటి రాజసేవకులైన బెవర్త వారసులు, జమిందారులు, రాజులకు సేవలందించిన గౌఢ, కుంభార, భండారి, ధొబా, బ్రాహ్మణ, కొరణ, మెరియ దొర, దళపతులు, రాజుల కాలంలో ప్రతిష్ఠించిన మందిరాల పూజారులు, వారి వారసులు మహారాణి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపాల బెవర్త జగన్నాథ్ పంగి, టుటు దళపతి, పాత్రికేయుడు తుషారకాంత మహంతి, త్రినాథ్ ఖొర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఉదయం నిర్వహించిన సమావేశంలో జీసీడీ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు సురేంద్రనాథ్ సాహు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షునిగా దీపక్ కుమార్ పృష్టి, ఉపాధ్యక్షులుగా జామి రాజారావు, ముచ్చి రవి, కార్యదర్శిగా చిన్నారి విజయ్ మోహన్, కోశాధికారిగా సుభాష్ చంద్రబారిక్‌లను నియమించారు. వీరికి మిగతా సభ్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

పర్లాకిమిడి: స్థానిక నగరంపల్లి వీధి నటరాజ్ సినిమా థియేటర్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 72 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. సిమెంట్ పైపులు తీసుకెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో నటరాజ్ సినిమా థియేటర్ వద్ద నివాసం ఉంటున్న రవీంద్రపండా (72) మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పర్లాకిమిడి ఆదర్శ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ పంచానన బెహరా ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మరో ప్రమాదంలో యువకుడు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కుమార్‌గూఢ గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పోడియా సమితిలో జరిగిన కోళ్ల పందేలను చూడడానికి సరిహద్దు రాష్ట్రం ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా దోర్నపాల్ గ్రామానికి చెందిన పదియ మడ్కమి (29)తో పాటు మరో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. వీరంతా తిరిగి వెళ్తున్న సమయంలో టంగుడుపల్లి గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో పదియ మడ్కమి తలకు తీవ్రగాయమవ్వగా, మిగతా యువకులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి గాయపడినవారిని పోడియా ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో పదియా మడ్కమి మృతి చెందాడు. పోలీసు ఐఐసీ అశోక్ కుమార్ బిశాయి కేసు నమోదు చేశారు.

విహంగ వీక్షణం

- చిలికాలో విదేశీ పక్షుల లెక్కింపు

అసియాలోనే అతి పెద్దదైన ఉప్పునీటి చిలికా సరస్సుకు విచ్చేసే విదేశీ అతిథి పక్షుల లెక్కింపు మొదలైంది. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి సైతం సంతానాభివృద్ధి కోసం వేల కిలోమీటర్లు ఆకాశంలో ఎగురుకుంటూ లక్షలాది విదేశీ విహంగాలు 1,100 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సరస్సులోని సుమారు 20 దీవుల్లో విడిది ఏర్పాటు చేసుకున్నాయి. వాటి రక్షణ కోసం చిలికా వణ్యపాణుల సంరక్షణ శాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. బొంబాయి నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్), వైల్డ్ ఒడిశా, నేషనల్ బోర్డ్ అఫ్ వైల్డ్, రిజినల్ మోసోమ్ అండ్ నేచురల్ హిస్టరీ, చిలికా డవలప్‌మెంట్ అథారిటీ కలిసి 32 బృందాలుగా విడిపోయి మంగళవారం నుంచి చిలికాలో విదేశీ పక్షుల లెక్కింపు మొదలుపెట్టారు. విదేశీ పక్షులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పర్యటకుల సందర్శన నిషేధించారు. గతేడాది 10,19,262 విదేశీ పక్షులు ఈ సమయానికి రాగా, ఈ ఏడాది చలి తక్కువగా ఉండడంతో తక్కువగానే పక్షులు వచ్చినట్లు చిలికా వన్యప్రాణుల సంరక్షణ సంచారకుడు జీఆర్ దాస్ తెలియజేయారు.

- బరంపురం



చిలికాలో విదేశీ విహంగాల విహారం



నలబన దీవిలో లక్షలాది విదేశీ పక్షులు సందడి



రంబా దగ్గర బ్రేక్‌ఫాస్ట్ ఐలాండ్‌లో విహరిస్తున్న విదేశీ గాడ్‌వాల్ పక్షులు



బొరుకుల దీవిలో విహరిస్తున్న విదేశీ పక్షులు



నలబన దీవిలో పక్షులు లెక్కిస్తున్న వివిధ అధికార సంస్థల బృందాలు

ప్రశాంతంగా నబరంగ్‌పూర్ బంద్

- హూ ఆర్ యూ అని సంబోధించడంపై బీజేపీ అభ్యంతరం
- డీఆర్‌డీఏ పీడీని బదిలీ చేయాలని డిమాండ్



నబరంగ్‌పూర్‌లో ఆందోళన చేపడుతున్న బీజేపీ శ్రేణులు



మున్సిపల్ చైర్మన్ కును నాయక్‌తో కలెక్టర్ కమలోచన్ మిశ్రా చర్చలు

కొరాపుట్: ఇటీవల జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్‌ను డీఆర్‌డీఏ పీడీ అన్యదాస్ హూ ఆర్ యూ అని సంబోధించిన విషయంపై బీజేపీ శ్రేణులు మండిపడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం బీజేపీ పిలుపుపై జిల్లా కేంద్రంలో బంద్ పరిపూర్ణంగా జరిగింది. తక్షణమే ఆమె క్షమాపణ చెప్పాలని, అలాగే ఆమెను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో ఉదయం నుంచే వర్తక వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు నిలిచిపోయాయి. పట్టణ పొలిమేరలు చమిరియా గుడ, కలెక్టరేట్ జంక్షన్ల వద్ద ఆ పార్టీ నాయకులు భైఠాయించి ఆందోళనలు చేపట్టారు. అత్యవసర విక్రయాలు జరిపే పెట్రోలు బంక్‌లు సైతం మూతబడ్డాయి. దీంతో జన జీవనం స్తంభించింది. దీనిపై అన్యదాస్ స్పందిస్తూ కును నాయక్ చైర్మన్ అని తనకు తెలియదని వివరణ ఇచ్చారు.



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

అయినప్పటికీ వివాదం కొనసాగడంతో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా ఆందోళనకారులను సర్క్యూట్ హౌస్‌కి పిలిచి చర్చలు జరిపారు. 15 రోజుల కాల పరిమితి అడిగారు. చర్చలు అసంపూర్ణంగా జరగడంతో కలెక్టర్ ఉన్నతాధికారులతో కలిసి ఆందోళన వద్దకు చేరుకొని సముదాయించారు. దీంతో శాంతించిన బీజేపీ శ్రేణులు సామరస్యపూర్వక వాతావరణానికి సహకరిస్తామని చెప్పారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ మజ్జి మాట్లాడుతూ పీడీని 15 రోజుల్లో బదిలీ చేయకపోతే 16వ రోజు జిల్లా బంద్ జరుగుతుందని ప్రకటించారు. ఆందోళనలో పార్టీ సీనియర్ నాయకులు జడేశ్వర్ ఖడంగా, కను దాస్, టున్నా దాస్, షర్మిష్ఠ దేవ్, శుభం చౌదరి, దేవదాస్ మహంకుడో తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సమాయత్తం



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- ఉన్నతాధికారుల సన్నాహక సమావేశం
- అట్టహాసంగా నిర్వహించేందుకు చర్యలు

భువనేశ్వర్: కోవిడ్ ఆంక్షల తొలగింపుతో ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన్ని భారీస్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర సమాచారం, ప్రజా సంబంధాల విభాగం సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించింది. స్థానిక మహాత్మాగాంధీ మార్గంలో పూర్తిస్థాయి పేరేడ్‌తో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. పీఎంజీ ఛక్ నుంచి మాస్టర్ క్యాంటిన్ ఛక్ వరకు కవాతు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ప్రజా సంబంధాల విభాగం ప్రధాన కార్యదర్శి సంజయ కుమార్ సింఘ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విభాగం డైరెక్టర్ ఇంద్రమణి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల్లో 50 బృందాలు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హోం సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఐజీ పోలీస్, ఏసీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ తదితర ఉన్నతాధికారులు హాజరవుతారు. గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 50 జట్లు పరేడ్‌లో పాల్గొంటాయి. నగర్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) పేరేడ్ కార్యకలాపాలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. 3 రోజులు ముందుగా రిహార్సల్ చేస్తారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాలకు ప్రాధాన్యం కల్పించనున్నారు. పేరేడ్‌లో కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), అగ్ని మాపక దళం బ్యాండ్‌లు పాల్గొంటాయి. రాష్ట్రంలోని వివిధ జానపద బృందాలు పాల్గొంటాయి. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి బృందం 3 నిమిషాల నిడివితో ప్రదర్శనలో పాల్గొంటాయి.

ముందస్తు పెరేడ్ సాధన

కవాతుకు 3 రోజుల ముందుగా మహాత్మాగాంధీ మార్గ్‌లో జనవరి 22, 23, 24 తేదీల్లో రిహార్సల్ నిర్వహిస్తారు. భువనేశ్వర్–కటక్ జంట నగరాల పోలీసు కమిషనరేట్ శాంతిభద్రతలు పర్యవేక్షిస్తుంది. గణతంత్ర దినోత్సవ ప్రాంగణంలో సీసీటీవీ ఏర్పాటు అవుతుంది.

పతకాల ప్రదానం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీసు, ఫైర్, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ అధికారులకు పతకాలు ప్రదానం చేస్తారు. హోంశాఖ ఆధ్వర్యంలో లోక్ సేవా భవన్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఒకరోజు ముందుగా 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం రిహార్సల్ నిర్వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ అధ్యక్షతన జరగనున్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి గౌరవ అతిథిగా హాజరవుతారని హోంశాఖ తెలిపింది.

నాటికలు జీవన శైలికి ప్రతిబింబాలు

జయపురం: కొరాపుట్ జిల్లాలో ఆదివాసీ నాటికలు, నృత్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని న్యాయవాది గోపాల పట్నాయిక్ అన్నారు. నాటికలు ఆదివాసీల జీవన శైలిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి సెమలగుడ పంచాయతీ ముండగుడ గ్రామంలో రాష్ట్రపతి పురస్కారం పొందిన ఆదివాసీ నాట్యగురు కర్ణ గౌఢ 'అఖికి పాచారో లోహర కొథా(కంటికి అడుగు ఇనుప కథ)' నాటకాన్ని సోమవారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాట్యగురు కర్ణ గౌఢ మాట్లాడుతూ.. ఈ నాటకాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివాసీల సంస్కృతి ఆధారంగా నాటకం రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద సురేంద్ర మహంతి, కళాకారులు రమేష్ బిశాయి, హరి అమనాత్య, యోగేంద్ర పనక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాట్యగురు కర్ణగౌఢ

కోలుకుంటున్న ప్రతాప్ చంద్ర షడంగి

భువనేశ్వర్: అస్వస్థతకు గురైన బాలాసోర్ పార్లమెంటరీ నియోజకవర్గం సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర షడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాను కోలుకుంటున్నట్లు మంగళవారం ట్విటర్ ద్వారా సందేశం జారీ చేశారు. గత 5 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన చికిత్స కోసం వైద్యులను సంప్రదించగా ఛాతీ ఇన్ఫెక్షన్ అయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు చికిత్స కొనసాగుతుంది. కోలుకొని త్వరలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతానని సందేశంలో పేర్కొన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

బస్సు–కారు ఢీ

- ఇద్దరు దుర్మరణం

భువనేశ్వర్: కలహండి జిల్లా 26వ నంబర్ జాతీయ రహదారిపై చాంచేర్ గ్రామం సమీపంలో సోమవారం అర్ధరాత్రి బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్కళ థాణా పోలీసులు, కెసింగా అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకొని మృతులు, బాధితులను తొలుత కెసింగా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం బాధితులకు ఉన్నత చికిత్స కోసం భవానీపట్న జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. ఉమర్‌కోట్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రైవేటు బస్సు, భవానీపట్న వైపు వెళ్తున్న కారుని ఢీకొన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణ నిర్ధారణ అయ్యింది. మృతులు భవానీపట్న ఇరిగేషన్ కాలనీకి చెందిన ఫిలిప్ గొచ్ఛాయత్, దినేష్ నాయక్‌గా గుర్తించారు. సీతా గొచ్ఛాయత్, మధుస్మిత గొచ్ఛాయత్, సౌరభ్ గొచ్ఛాయత్ తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు భవానీపట్న జిల్లా ప్రధాన ఆస్పత్రి వైద్య వర్గాలు తెలిపాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు




ప్రమాదానికి గురైన బస్సు

హాకీ ఫీవర్

స్థానిక రాజధాని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హాకీ పురుషుల ప్రపంచ కప్ నమూనాను కళాశాల ఆవరణలో మంగళవారం సుందరంగా ఆవిష్కరించారు. ప్రస్తుతం హాకీ కప్ రాష్ట్ర పర్యటన ఘనంగా జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో మ్యాచ్‌లు మొదలు కానున్న నేపథ్యంలో రాష్ట్రమంతటా హాకీ ఫీవర్ నెలకొంది.

- భువనేశ్వర్



క్లుప్తంగా

ఆదర్శనీయురాలు సావిత్రీబాయి పూలే



మాట్లాడుతున్న ప్రమోద్ మహంతి

జయపురం: నేటి మహిళలకు ఆదర్శనీయురాలు సావిత్రీబాయి పూలే అని ఒడిశా రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి అన్నారు. స్థానిక కార్మిక భవనంలో కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు చదువు అవసరమని సూచించిన గొప్ప మనిషి సావిత్రీ బాయి అన్నారు. ఉపాధ్యాయునిగా మహిళా విద్యకు ఎంతగానో కృషి చేశారని తెలియజేశారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉలిత సాహు, కమళ జాని, కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, జోనల్ కార్యదర్శి సత్యబ్రత నందో, సన్యాసి మాలి, నంద హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఆయా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్టు, ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెదర్ ఇండస్ట్రీస్ జిల్లాకు దగ్గరలో ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలకు సంబంధించి అనుమతులు, రెన్యువల్స్‌పై సమీక్షించారు. విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో పాల్గొనాలని చెప్పారు. గ్రానైట్ యాజమాన్యాలకు ఒక్కో గ్రానైట్ కంపెనీకి ఎన్ని సర్వే రాళ్లు నిర్ణయించారో తెలుసుకోవాలని భూగర్భ గనుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని ఆదేశించారు. ఇంతవరకు ఎన్ని సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నాయని జేసీ అడగ్గా, ఒక లక్ష 40 వేల సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నట్లు జేసీకి డీడీ వివరించారు. ఏపీఐఐసీ జెడ్ఎం యతిరాజు మాట్లాడుతూ భూ సమస్యల గురించి జేసీకి వివరించారు. జీఎం ఎ.సుధాకర్ మాట్లాడుతూ గత సమావేశంలోని విషయాలపై వివరించారు.

● వేషధారణ భేష్



దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా అధికారులు, నాయకులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థిని పిట్ట చార్మి సావిత్రీ బాయి వేషధారణలో అందరినీ ఆకట్టుకుంది. – మందస


● మేలుకొలుపు విని.. మీకు శుభమని



42 ఏళ్లుగా సాగుతున్న మేలుకొలుపు ఇది. కొత్తూరులో దశాబ్దాలుగా సాగుతున్న సంప్రదాయం ఈ ధనుర్మాసంలోనే కనిపించింది. ఈ బృందం వేకువ జామున ఇలా నగర సంకీర్తన చేస్తూ బియ్యం, నగదు సేకరిస్తారు. వీటితో అన్నదానాలు, ప్రవచనాలు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. – కొత్తూరు

మరో రష్యన్ మృతి

- పారదీప్‌లో శవమై కనిపించిన వైనం
- అవసరమైతే క్రైం శాఖ దర్యాప్తు: డీజీపీ



మిలియాకోవ్ సెర్గీ, రష్యన్ చీఫ్ ఇంజినీర్

భువనేశ్వర్: రాయగడలో ఇద్దరు రష్యన్ల మరణం మిస్టరీ కొనసాగుతుండగా పారాదీప్‌లో మంగళవారం మరో రష్యన్ జాతీయుడు శవమై కనిపించాడు. జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ పోర్ట్ లంగరు వద్ద ఓడలో మిలియాకోవ్ సెర్గీ (51) తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు ఓడ చీఫ్ ఇంజినీర్‌గా గుర్తించారు. అవసరమైతే ఈ ఘటనపై క్రైమ్ శాఖ విచారణకు ఆదేశిస్తామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సునీల్ కుమార్ బన్సాల్ తెలిపారు.

పోర్టు వైద్య బృందం పరిశీలన

మిలియాకోవ్ సెర్గీ అస్వస్థతకు గురయ్యాడనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరిన పారాదీప్ పోర్టు వైద్య బృందం అతను మృతి చెందినట్లు గుర్తించింది. ఈ విషయం తెలియడంతో పారాదీప్ ఠాణా పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పారాదీప్ పోర్టు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు.

మూడో రష్యన్ మృతి

రాష్ట్రంలో పదిహేను రోజుల స్వల్ప వ్యవధిలో మూడో రష్యా జాతీయుడి అనుమానాస్పద మృతి ఇది. రష్యా శాసనసభ్యుడు పావెల్ ఆంటోవ్, అతని స్నేహితుడు మిఖాయిల్ బైదానేవ్ రెండు రోజుల వ్యవధిలో రాయగడలోని ఒక హోటల్‌లో శవమై కనిపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇలా జరగడంతో ఆందోళన నెలకొంది. దీనిపై పారాదీప్ పోర్టు అథారిటీ (పీపీఏ) చైర్మన్ పి.ఎల్.హరనాథ్ మాట్లాడుతూ విచారణ పూర్తయితే విషయం స్పష్టం అవుతుందన్నారు. నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

క్షుణ్ణంగా పరిశీలిస్తాం: డీజీపీ

ఈ ఘటనపై డీజీపీ సునీల్ బన్సాల్ మాట్లాడుతూ పోర్టు అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత క్రైం శాఖ దర్యాప్తు విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ నౌక బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవు నుంచి ఇనుప ఖనిజం రవాణా కోసం పారాదీప్ పోర్టుకు వచ్చినట్లు సమాచారం.

ప్లాస్టిక్ గన్‌తో డాక్టర్‌కు బెదిరింపులు



నిందితుడు కరణ్ కులదీప్



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ గన్, డాక్టర్ సెల్‌ఫోన్

- నిందితుడు అరెస్టు

కొరాపుట్: ప్లాస్టిక్ గన్ చూపించి హత్య చేస్తానని డాక్టర్‌ను భయపెట్టిన నిందితుడిని కొరాపుట్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం కొరాపుట్ జిల్లాకేంద్ర పోలీసుస్టేషన్ ఐఐసీ ధీరేన్ పట్నాయక్ కేసు వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్రాన్సుశేఖర్ రౌత్రాయ్‌ని గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుర్భాషలాడుతూ మొబైల్ ఫోన్ తీసుకొని తలపై గన్ పెట్టి బెదిరించి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. డాక్టర్ ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి ఒడియా గుడకి చెందిన కరణ్ కులదీప్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గన్ స్వాధీనం చేసుకోగా అది ప్లాస్టిక్ గన్‌గా తేలింది. అలాగే అతని వద్ద ఉన్న డాక్టర్ మొబైల్‌ని స్వాధీనం చేసుకున్నారు. విధుల్లో ఉన్న డాక్టర్‌పై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని జైలుకి తరలించారు.

స్పాట్ అడ్మిషన్ల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మంగళవారం పోస్టు గ్రాడ్యుయేషన్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. ఈ ప్రవేశాలకు ఏపీ పీజీ సెట్‌లో ర్యాంకు తప్పనిసరి. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన వర్తించకపోవటం, మొత్తం ఫీజు ఒకేసారి చెల్లించటం వంటి వాటి వల్ల స్పాట్‌కు ప్రవేశాలకు అరకొర స్పందన లభించింది. మొత్తం ఫీజు చెల్లించేందుకు ఆసక్తి గల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. బయోటిక్నాలజీలో 3, మైక్రో బయోలజీలో 3, ఎనలిటికల్ కెమిస్ట్రీలో ఒక్కరు చేరారు.

గోమాత రుణం తీర్చుకున్నారు

- ఆవుకు పెద్ద కర్మ చేసిన రైతు



పొరుగింటి మహిళకు చీరను అందిస్తున్న బైరమ్మ



బైరమ్మ అల్లారుముద్దుగా పెంచుకున్న దేశీయపాడి ఆవు

కవిటి: ఆ ఇంట రెండు దశాబ్దాలుగా గోమాత తిరిగింది. ఇంటిల్లిపాదికీ పాలిచ్చి ఆదుకుంది. తొమ్మిది ఈతలు ఈనింది. పెద్ద కొడుకులా ఆర్థికంగా అండగా నిలిచింది. ఇన్నేళ్లుగా ఇంటిలో మనిషిలా కలిసిపోయిన గోమాలచ్చిమి పది రోజుల కిందట అందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయింది. పొద్దున్న లేచింది మొదలు గోధూళి వేళ వరకు ఆవు పిలుపుకు అలవాటు పడిపోయిన ఆ రైతు కుటుంబ సభ్యులు ఈ ఎడబాటును భరించలేకపోయారు. ఇన్నేళ్ల సేవకు గుర్తుగా గోవుకు పెద్దకర్మ నిర్వహించారు. కవిటి మండలం ఆర్.బెలగాంకు చెందిన పి.బైరమ్మ తన ఇంటిలో 22 ఏళ్లుగా అపురూపంగా చూసుకుంటున్న ఆవు మృతి చెందడంతో శాస్త్రోక్తంగా దశ దిశ కర్మ నిర్వహించారు. 11 వ రోజున తమ ఊరిలో ఉన్న ఇరుగుపొరుగు వారిని పిలిచి 25 మంది మహిళలకు చీర జాకెట్లు, 25 మంది పురుషులకు తువ్వాళ్లు, లుంగీలు అందించారు. గోవు రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని తడికళ్లతో చెప్పారు.

డ్వాక్రా బజార్.. స్టాళ్లు తయార్

- శ్రీకాకుళంలో డ్వాక్రా బజార్ ప్రారంభం
- ఆకర్షిస్తున్న స్టాళ్లు



జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



స్టాల్స్‌ను చూస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

డ్వాక్రా బజార్..



వేదిక	శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం
వేళలు	ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు
ఎప్పటి వరకు	ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి రోజూ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో డ్వాక్రా బజార్ సిద్ధమైంది. స్వయం సహాయక బృందాల్లోని మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. ఈ బజార్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. నాబార్డ్, యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ బజార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యంత్రాల వినియోగం వల్ల సంప్రదాయ చేతివృత్తులు దెబ్బ తిన్నాయని, అలాంటి వారికి చేయూత అందించాల్సి ఉందన్నారు. అందుకే డ్వాక్రా బజారు పేరిట మహిళలు, గిరిజనులు తయారుచేసిన వస్తువులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి విక్రయించేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సంక్రాంతి రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి నగరానికి జనం వస్తారని, వారికి వివిధ ప్రాంతాల వస్తువులు అందుబాటులో ఉండేలా డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసిందన్నారు. అనంతరం సీడాప్, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగమేళా గోడపత్రికను మంత్రి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా రైతు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్యం–ఆదాయం కార్యక్రమం పేరిట శ్రీకాకుళం మండలంలో 5వేల మందికి ఆరోగ్యాన్ని అందించేందుకు మునగ మొక్కలను మహిళలకు పంపిణీచేశారు. తొలుత సంప్రదాయం గురుకులం ఆధ్వర్యంలో లీలాకృష్ణ నృత్య బృందం చేసిన నృత్యాలు, సాయి విద్యామందిర్ విద్యార్థి తన్మయి చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మహిళా ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ బి.హేమమాలిని రెడ్డి, పోలినాటి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.కృష్ణవేణి, ఐటీడీఏ పథక అధికారి బి.నవ్య, నాబార్డ్ డీడీఎం వరప్రసాదరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, మైలపల్లి మహాలక్ష్మి, మండవిల్లి రవి, కామేశ్వరి, గొండు శారద, యామిజాల గాయత్రి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.కృష్ణవేణి, చల్లా అలివేలుమంగ, స్వచ్ఛంద సంస్థల సంచాలకులు ఎం.ప్రసాదరావు, ఎస్.సన్యాసిరావు, ఎస్.ఆశాదీపిక, సాంబమూర్తి, కోణార్క్ శ్రీను, ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.

'ఏకపక్ష అరెస్టులు సరికాదు'



ఎస్పీ సార్వణ్ వివేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత గ్రామస్తులు

బరంపురం: గంజాం జిల్లా పత్రపూర్ బ్లాక్ పరిధి పిత్తతొలి గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన కొట్లాటలో పోలీసులు జరుపుతున్న ఏకపక్ష అరెస్టులు ఆపాలని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా సమంతరాయ్ కోరారు. ఈ మేరకు బరంపురం ఎస్పీ కార్యాలయం ఎదుట గంజాం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో పిత్తతొలి గ్రామంలో ఒక వర్గానికి చెందిన బాధితులతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో జరిగిన కొట్లాటలో గోళంతరా పోలీసులు నిజమైన నేరస్తులను అరెస్టు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా నేరస్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ సార్వణ్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎక్కువ కేసులు పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలు రకాల కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. ఈ తీర్పులపై అప్పీలుకు వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ లోక్ అదాలత్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కేంద్రంలోనే కాకుండా జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ నిర్వహిస్తామన్నారు.

నేడు, రేపు జిల్లాస్థాయి శాప్ లీగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి శాప్ లీగ్ కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలకు రంగం సిద్ధమైంది. శాప్ ఆదేశాల మేరకు కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్లను ఈ నెల 4వ తేదీన కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 85 కేజీల్లోపు బరువు ఉండాలన్నారు. కబడ్డీ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 8790595046 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వెయిట్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీకాకుళం రూరల్‌లోని పెద్దపాడు రెయ్యమ్మతల్లి వ్యాయామశాల జిమ్‌లో జరుగుతాయని తెలిపారు. అండర్–17 విభాగంలో 2005 డిసెంబర్ 31 తర్వాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ప్రవేశ రుసుం రూ.200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8,9 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి శాప్‌లీగ్ కబడ్డీ పోటీలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 99498 61168 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కిల్ హబ్ సెంటర్ ప్రవేశానికి 7న స్క్రీనింగ్ టెస్ట్

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణా స్కిల్ హబ్ సెంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 7న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి హాజరు కావాలని కోరారు. వివరాల కు 9493290012 కు సంప్రదించాలన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం



లక్ష్మీనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్/నరసన్నపేట: సింగుపురం పరిధిలోని నీలం జ్యూట్ మిల్ సమీపంలో సర్వీసు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం గుండువల్లిపేటకు చెందిన పంచిరెడ్డి లక్ష్మీనారాయణ (30) దుర్మరణం పాలయ్యాడు. ఈయన ఓ షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం కూడా విధులకు హాజరవుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు మూడు నెలల కిందటే వివాహం జరిగింది. సోదరుడు పంచిరెడ్డి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లక్ష్మీనారాయణ మృతితో స్వగ్రామం గుండువల్లిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు రాములు, చిన్నమ్ముడు, భార్య లావణ్య కుప్పకూలిపోయారు.

తామర పురుగుతో జాగ్రత్త



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త విశాలాక్షి

రణస్థలం: మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించడంతో పూత పిందెగా ఏర్పడకముందే రాలిపోతోందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సస్యరక్షణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి అన్నారు. రణస్థలం మండలం వి.ఎస్.పురంలో మిరప పంటలపై నిర్వహిస్తున్న ప్రయోగ క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తామర పురుగు నివారణకు బవేరియా వంటి జీవ శిలీంద్ర పొడి మందులను లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి మొక్క అంతటా తడిచేలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. రసాయన మందులపై పెట్టే ఖర్చు ఆదా అవడమే కాకుండా, పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, సమన్వయకర్తలు బి.లక్ష్మీనరసింహమూర్తి, పి.రమణ, బి.భానుమూర్తి, జె.గోపాల్, రైతుమిత్రలు రెడ్డి గోవిందరావు, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పనిచేయని క్వారీల లీజు రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పనిచేయని గ్రానైట్, క్వారీల్లో తక్షణమే పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో లీజు రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రానైట్, క్వారీ యజమానులతో లీజులపై సమీక్షించారు. ముందుగా గ్రానైట్ కంపెనీలు, క్వారీల స్థితిగతులపై భూగర్భగనుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెన్యూవల్స్ పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లీజుదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్, భూగర్భ గనుల శాఖ ఏడీ బాలాజీనాయక్, ఉత్తరాంధ్ర గ్రానైట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కటి ప్రవృత్తి

- అద్భుతమైన దారు శిల్పాలు తయారు చేస్తున్న షణ్ముఖరావు
- రైతు నుంచి కళాకారుడిగా మారిన వైనం
- శిల్పం చేస్తే అదుర్స్



పనిలో షణ్ముఖరావు



షణ్ముఖరావుచేసిన సీతారామలక్ష్మణ హనుమ మూర్తులు



చెక్క శిల్పాలతయారీ కోసం ప్రత్యేకంగా చేయించిన పనిముట్లు

కవిటి: అతని చదువు పది. పని వ్యవసాయం. ఉద్యోగం కోసం ఎక్కడికో వలస వెళ్లారు. ఏవేవో పనులు చేశారు. కానీ భగవంతుడు ప్రసాదించిన కళ ఆయనకు ఉన్న ఊరిలోనే ఉపాధి చూపింది. ఉపాధి చూపించడమే కాదు కళాకారుల్లో ఆయనకు ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. కవిటి మండలం డొంకపుట్టుగకు చెందిన గుప్పి షణ్ముఖరావు చెక్కపై శిల్పాలు(దారు శిల్పాలు) అద్భుతంగా తయారు చేస్తున్నారు. పొట్ట కూటి కోసం 1990లో ముంబై వెళ్లిపోయిన షణ్ముఖరావు అక్కడ జాతీయస్థాయిలో పేరుపొందిన గురువు రెనాల్డ్ సీక్వెరా వద్ద చెక్కశిల్పం(దారు శిల్పం)లో మెలకువలు నేర్చుకున్నారు. దశాబ్ద కాలం అక్కడే ఉండి వేలాది బొమ్మలు తయారు చేశారు. తర్వాత ఆరోగ్యం పాడవడంతో కవిటి మండలం సొంతూరుకు వచ్చేశారు. ఇక్కడే తనకున్న రెండున్నర ఎకరాల కొబ్బరితోటపై ఆధారపడి ప్రవృత్తి అయిన దారుశిల్పాల(చెక్కపై శిల్పం) తయారీలో ముందుకు సాగుతున్నారు.

'చెక్క'టి గిరాకీ

ఆయన ఎంచుకున్న ఈ చెక్కబొమ్మలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీన్ని అవకాశంగా ఎంచుకున్న షణ్ముఖరావు ఆనాటి నుంచి నేటివరకు వెను తిరిగిచూడలేదు. ప్రస్తుతం ఒక్కో బొమ్మ రూ.10,000 నుంచి రూ.3.5లక్షల వరకు ధర పలుకుతోంది. దేవీ దేవతల విగ్రహాలు, బుద్ధుడు, జీసస్, లాఫింగ్ బుద్ధ, సింహం, పులి ఇలా కొనుగోలుదారుల కోరిక మేరకు బొమ్మల్ని చేసి ఇస్తున్నాడు. ఇప్పటి వరకు అత్యధికంగా 12 అడుగుల ఎత్తున్న శిల్పాల్ని కూడా చెక్కాడు.

గుమ్మడి, తెల్లజిల్లేడు కలపలతో..

ఈ వృత్తిలో శిల్పాలను చెక్కడానికి మంచి నాణ్యత కలిగిన చెక్క అవసరం. ఇందుకోసం గుమ్మడి కర్ర అధికంగా వినియోగిస్తున్నారు. అలాగే తెల్లజిల్లేడు చెక్కతో గణేశుని విగ్రహం పూజామందిరంలో ఉంటే ఎంతో శ్రేష్ఠమని భక్తుల విశ్వాసానికి తగ్గట్టుగా ఆ బొమ్మలు ఎక్కువగా చేసి ఇచ్చానని చెబుతున్నారు. ప్రభుత్వం అటవీశాఖ అనుమతితో చందనం కర్ర పై విగ్రహం కావాలంటే వారి సొంతంగా అనుమతిపత్రాలు సంబంధిత శాఖ ద్వారా ఇస్తే చేసి ఇవ్వగలుగుతానని అంటున్నారు.

అన్నీ తానే..

చెక్కను తీసుకున్న తర్వాత చిన్నపాటి ఉలి,సుత్తితో దానికి తుది రూపం తీసుకువచ్చిన తర్వాత దానికి నగిషీ పడతారు. ఇందుకోసం అన్ని పనులు ఆయనే స్వయంగా చేస్తారు. ఒక నెలలో మూడు నుంచి ఐదు వరకు చిన్నసైజు బొమ్మలు చేస్తున్నారు. పెద్ద బొమ్మలు అయితే మూడు నుంచి ఐదునెలల వ్యవధి ఒక్కో బొమ్మకు టైమ్ పడుతుంది.

సీఎం పేషీలో బొమ్మ పెట్టాలి..



ఇప్పటి వరకు వేలాది బొమ్మల్ని చెక్కాను. కవిటి చింతామణి అమ్మవారి విగ్రహాన్ని అక్కడ ఉచితంగా చేసి పెట్టాను. అదేవిధంగా విశాఖపట్నంలో పెట్టే రాజధాని కేంద్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేషీలో నేను చేసిన తెలుగుతల్లి చెక్క బొమ్మ బహుమతిగా అందించాలని కోరుకుంటున్నాను.

– గుప్పి షణ్ముఖరావు, డొంకపుట్టుగ, కవిటిమండలం

క్లుప్తంగా

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని మంగళవారం పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తీపి పదార్థాలను నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావి చెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కిశోర్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎంపీ 'బెల్లాన' ఇంట్లో శత చండీయాగం



శతచండీ యాగంలో ఎంపీ బెల్లానతో పాటు కుటుంబసభ్యులు

చీపురుపల్లి: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసంలో శతచండీ యాగ మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న శతచండీ యాగంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, సతీమణి శ్రీదేవి, కుమారుడు వంశీకృష్ణ, పావని దంపతులు పాల్గొన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు శతచండీ యాగం జరుగుతుందని పండితులు తెలిపారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఖాళీస్థలాలకు టెండర్లు

విజయనగరం టౌన్: విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, చీపురుపల్లి బస్‌స్టేషన్ పరిసరాల్లో ఉన్న ఖాళీస్థలాలు/షాపులకు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆయా డిపోల్లో టెండర్ ఫామ్స్ పొందవచ్చన్నారు. వివరాలకు ఆయా డిపోమేనేజర్‌లను సంప్రదించాలని సూచించారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

లక్కవరపుకోట: తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన కొంతమంది యువకులు అరకు అందాలు చూసేందుకు వెళ్తుండగా ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన ఎం.విఘ్నేష్(26) స్నేహితులతో కలిసి ఈ నెల 1వ తేదీన విశాఖపట్నం చేరుకుని అక్కడ అద్దెకు ద్విచక్రవాహనాలు తీసుకుని అరకు బయల్దేరారు. ఎల్.కోట పాత జంక్షన్ సమీపంలో రోడ్డుపైనగల గుంతను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో విఘ్నేష్ కిందపడి తీవ్ర గాయాల పాలవడంతో స్నేహితులు విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గాయత్రి కాలనీ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేశామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.13,220 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సిరా కుమార్ తస్యప్

గరుగుబిల్లి: తోటపల్లి కుడిప్రధానకాలువ పరిధిలోని చినగుడబ గ్రామ రెవెన్యూ పరిధిలో గల ముదిలి దుర్గాప్రసాద్ తోటలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానిక వీఆర్‌ఓ జోజి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి చనిపోయిన వ్యక్తి జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా పేరు సిరాకుమార్ తస్యప్ (జగదల్‌పూర్)(30)గా నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.

హరిలో రంగ హరి..!

- గ్రామాల్లో మొదలైన హరిదాసుల సందడి
- సంతరించుకున్న సంక్రాంతి శోభ..



కురుపాం: గ్రామాల్లో కీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

కురుపాం/పార్వతీపురం: పల్లెల్లో సంక్రాంతి శోభ ప్రారంభమైంది తెలతెలవారక ముందే హరిలో రంగ హరి..గోవిందా హరి.. అంటూ హరిదాసుల సంకీర్తన ప్రారంభమైంది. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి పల్లెలు. పల్లెల్లో సంస్కృతి సంప్రదాయాలు సంక్రాంతి నెల రోజుల్లో ప్రతిబింబిస్తాయి. సంక్రాంతి పండగ ఆగమనాన్ని గుర్తుచేస్తూ తలపై అక్షయ పాత్ర, మెడలో నిలువెత్తు దండ, పట్టు పీతాంబరాలు ధరించి..ఒక చేతిలో చిడతలు..మరోచేతిలో తంబుర .. నుదుటన నామాలు ..కాళ్లకు గజ్జెలు..విష్ణు నామ స్మరణతో కంచు కంఠంతో సంక్రాంతి నెల రోజులూ పల్లెల్లో ఇళ్ల ముంగిట హరిదాసులు దర్శనమిస్తారు. ఈ నెల రోజులు వారు ఎవరి ఇంటి ముంగిటా ఎక్కువ సేపు నిలవరు. కానుకలు సమర్పించినా సమర్పించక పోయినా గోవిందా హరి అంటూ ముందుకు సాగిపోతారు. తెల్లవారుజామున సాగే వారి ప్రయాణం సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చే వరకూ సాగుతుంది. ఈ సందర్భంగా సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకం రామచంద్రా..అంటూ భద్రాద్రి రామదాసు కీర్తనలు రాగయుక్తంగా ఆలపిస్తారు.

అక్షయ పాత్ర చాలా ముఖ్యం

హరిదాసుల అక్షయ పాత్ర చాలా ముఖ్యమైంది. తెల్లవారుజామున పాత్రను తలపై పెట్టుకుని గ్రామ సంచారం పూర్తయిన దానిని తలపై నుంచి దించాలని సంవత్సరాలుగా హరిదాసు వృత్తిలో ఉన్న వారు చెబుతున్నారు. ధనుర్మాసం నెల రోజులూ సూర్యోదయానికి ముందు శ్రీకృష్ణ, గోదాదేవిలకు నివేదన చేసి, తిరుప్పావై పఠించి అక్షయపాత్రను ధరిస్తారు. గ్రామసంచారం ప్రారంభమైన దగ్గర నుంచి అక్షయ పాత్ర దించడం కానీ, మాట్లాడడం కాని చేయరాదు. అధ్యాత్మిక, రామాయణ కీర్తనలు, కృష్ణ లీలలను గానం చేస్తూ సంక్రాంతి శోభ పల్లెలకు విస్తరిస్తామని హరిదాసులు వివరిస్తున్నారు.

అక్షయపాత్ర చరిత్ర

శ్రీ మహావిష్ణువు సూర్య భగవానుడికి అందించిన అక్షయపాత్రను వనవాస సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం ఈ పాత్రను ఎవరికైనా ఇవ్వడం ఎలా? అన్న ధర్మరాజు సందేహాన్ని నివృత్తి చేస్తూ శ్రీకృష్ణుడు సలహా చెప్పాడు . ఒక మంటపానికి వేయి గంటలు కట్టించి, విప్రోత్తములందరినీ పిలిచి అన్న సమారాధన చేయాలి. ఆ సమయంలో ఏకకాలంలో వేయి గంటలు మోగాలని ధర్మరాజుకు శ్రీకృష్ణుడు చెప్పాడు. శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా ధర్మరాజు చేసినప్పటికీ వేయి గంటలు ఒకేసారి మోగకపోవడంతో కృష్ణుడిని మళ్లీ ప్రార్థించాడు. కృష్ణుడు అప్పుడు ఓ వైష్ణవుడిని పిలిచి భోజనం చేయమని అర్థించగా స్వయం పాకం కోరాడు. ఆ వైష్ణవుడు స్వయంగా వండి, వార్చి, గోదాదేవి సహిత శ్రీకృష్ణమూర్తికి నివేదన చేసిన తరువాత భుజించగా ఆ వేయి గంటలు మోగినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. దీంతో ధర్మరాజు అక్షయపాత్రను వైష్ణవుడికి ఇవ్వగా అప్పటి నుంచి ఆ పాత్రను ధనుర్మాసంలో తలపై ధరించి విష్ణునామ సంకీర్తనలతో గ్రామ సంచారం చేసే వృత్తి తమకు సంక్రమించిందని హరిదాసు పిరిడి సింహాచలం తెలిపారు.

5, 6 తేదీల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న ఉదయం 9 గంటలకు విజ్జి స్టేడియంలో బాస్కెట్‌బాల్ పోటీలు, 6న ఉదయం 9 గంటల నుంచి ఎంఆర్ స్టేడియంలో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరగనున్నట్లు చెప్పారు.
ఈ ఎంపిక పోటీ ల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తూ 19 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని, అర్హత ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పక్కాగా అమలు చేయండి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



గొట్లాం వద్ద జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

బొండపల్లి: జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకుగాను తీసుకుంటున్న చర్యలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి వివిధ శాఖలు అధికారులను ఆదేశించారు. మండలంలోని గొట్లాం గాయత్రి కాలేజ్ సమీపంలో గల బ్లాక్ స్పాట్‌ను మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్పీడ్ గన్‌ను ఏర్పాటు చేయగా పరిశీలించారు.బ్లాక్ స్పాట్ వద్ద ఏర్పాటు చేసిన రంబెల్ స్ట్రిప్స్‌తో పాటు వేగనిరోధకాలు సరిపోవని మరిన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. వాటితో పాటు ఇదే ప్రాంతంలో స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేసి వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి వాహనాల యజమానులకు జరిమానాలు విధించాలని సూచించారు. అలాగే తర,చూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరికగా ప్రమదాలకు గురైన వాహనాల ఫొటోలను ప్రదర్శనలో ఉంచాలని చెప్పారు.జాతీయ రహదారితో పాటు ,ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, హోర్డింగులు రోడ్డు మార్జిన్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వేగ నియంత్రణపై దృష్టి

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో గొట్లాం, బొండపల్లి, కింతలపాలెం, పూల్ బాగ్, సారిపల్లి,అచ్యుతాపురం, గుర్ల, గరివిడి ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. వివిధ శాఖల సంయుక్త తనిఖీల్లో పది బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని చెప్పారు.ఇలాంటి చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లాడ్వా,రంబెల్ స్ట్రిప్స్, ట్రాఫిక్ సేఫ్టీ కోన్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు, ఇతర రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి వేగనియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ జీవీ రమణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.రమణ, రవి శంకర్ ప్రసాద్, ఐఆర్‌ఏడీ జిల్లా మేనేజర్ ఎం.శ్రీధర్, ఎస్.హెచ్ డీఈఈ నర్సింగరావు, ఏఈ సురేష్,తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఏ ఎ.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిగుంటలో కదలని గజరాజులు



సుందరపురంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: గడిచిన నెలరోజులుగా కుమ్మరిగుంట, కంబవలస పంచాయతీ ప్రజలకు ఏడు గజరాజుల గుంపు కంటిమీద కునులేకుండా చేస్తోంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అర్తాం రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచిస్తున్న గజరాజుల గుంపు సోమినాయుడువలస గేటునుంచి రాజ్యలక్ష్మీపురం వెళ్లే రహదారిపై తచ్చాడుతున్నాయి. దీంతో ఆ రహదారిపై ప్రయాణం చేయడానికి ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే గంగరేగువలస, కుమ్మరిగుంటలో ప్రధాన పంటలైన టమాటో, చెరకు, అరటి, తదితర పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించేలా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

8న గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్

- 5,530 మంది అభ్యర్థులకు 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్ ఈ నెల 8న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. విజయనగరం పట్టణంలోని 13 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్న పరీక్షకు 5,530 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. లైజన్ అధికారులందరూ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి వసతులపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ నెల 6న ఏపీపీఎస్‌సీ ప్రతినిధుల సమక్షంలో మరో సమావేశం జరగనుందని, అభ్యర్థులకు అవసరమైన సూచనలు వెల్లడిస్తారన్నా రు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, లైజన్ అధికారులు, కళాశాలల ప్రతినిధులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు గొట్లాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లాం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు హెచ్.ఎం, శ్రీరామాచారి, పీడీ యు.సత్యానంద్‌లు మంగళవారం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ఐ.దుర్గ, కె.పావని, బి.హరిలు ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. వారు త్వరలో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

విజయనగరంలో కోవిడ్ కేసు నమోదు

- ఆస్ట్రేలియా నుంచి వచ్చిన మహిళకు పాజిటివ్‌గా నిర్ధారణ
- హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న మహిళ
- పాజిటివ్ వచ్చిన మహిళది బొండపల్లి మండలం గరుడుబిల్లి

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో కోవిడ్ టెన్షన్ మళ్లీ మొదలైంది. ఫోర్త్ వేవ్‌లో తొలి కేసు నమోదైంది. మొదటి, రెండో వేవ్‌ల్లో కోవిడ్ విలయ తాండవం సృష్టించింది. ఆ తర్వాత వ్యాక్సినేషన్ జరగడంతో థర్డ్‌వేవ్ వచ్చినా అంతగా ప్రభావం చూపలేదు. కొద్ది నెలలుగా కోవిడ్ కేసులు నమోదు కాలేదు. తాజాగా కేసు నమోదుకావడం చర్చనీయాంశమైంది. బొండపల్లి మండల గరుడుబిల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు ఆస్ట్రేలియా నుంచి ఈ నెల ఒకటో తేదీన వచ్చారు. విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌లో భార్యభర్తలిద్దరికీ కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా భార్యకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆమె భర్తకు నెగిటివ్ అని వచ్చింది. ప్రస్తుతం వారిద్దరు వారి స్వగ్రామంలో హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. విజయవాడ ల్యాబ్ నుంచి వచ్చిన తుది వైద్య రిపోర్టు తర్వాత ఏ వేరియంట్ అనేది తెలుస్తోందని డీఎంహెచ్‌ఓ రమణకుమారి తెలిపారు. ప్రస్తుతం వారిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కోవిడ్ కేసు నమోదు కావడంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తయ్యారు.

510 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు

- వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథ స్వామి



విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథస్వామి

వేపాడ: జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథ స్వామి తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన వేపాడ మండలంలో ధాన్యం కొనుగోలు పరిశీలనకు వచ్చిన సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల అరవైనాలుగు వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే లక్షా ఏభై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఎఫ్‌టీఓ జనరేట్ అయిన పదిరోజుల్లో పేమెంట్ రైతు ఖాతాల్లో జమ అవుతోందని తెలిపారు. ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు తెలిపారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండడంతో కొనుగోలు లక్ష్యం పెరిగే అవకాశమున్నందున అదనపు కొనుగోలుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. రబీలో అపరాలు సాగులో ఉన్నందున పంటలో బూడిద తెగులు, కాయతొలుచు పురుగు నివారణకు సంబంధిత వీపీఏలను రైతులు సంప్రదించి నివారణ మందులు పిచికారీ చేయాలని సూచించామన్నారు. అనంతరం బానాది ఆర్‌బీకేనీ సందర్శించారు. ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయని ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించాలని బానాది సర్పంచ్ కర్రి యశోద జేడీ దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీబీ యశ్వంతరావు, సీఎస్‌డీటీ రామకృష్ణ వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన పెద్ద పోలమాంబ అనుపోత్సవం



అమ్మవారి ఘటాలు తలపై పెట్టుకుని ఊరేగించేందుకు సిద్ధమైన భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తుల ఆరాధ్య దైవం శంబరపోలమాంబ అమ్మవారు మేనత్త పెద పోలమాంబ అమ్మవారి ఉత్సవం (పెద్ద పండగ) మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గతనెల 29తేదీన గ్రామం శివారులో ఉన్న పెద్దఅమ్మవారిని గ్రామంలోని చదురుగుడిలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తొమ్మిదిరోజుల పాటు ఆలయంలో అమ్మవారి ఘటాలు పూజలందుకోగా మంగళవారం సాయంత్రం ఘటాలను బాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ, ఊరేగించారు. రాత్రంతా గ్రామంలోని అన్ని పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించగా, భక్తులు ఘటాలకు పూజలు చేశారు. రహదారిపై ఉంచిన నూతనవస్త్రాలపై చిన్న పిల్లలను పడుకోబెట్టగా అమ్మవారు ఘటాలు పట్టుకున్న భక్తులు చిన్నపిల్లలను దాటుకుంటూ వెళ్లారు. దీనివల్ల చీడపీడల బారినుంచి చిన్నపిల్లలు తప్పించుకోవచ్చని భక్తుల విశ్వాసం. ముందుగా గ్రామానికి చెందిన గిరడవారి, నాయుడువారి (పూడి), కర్ణాలు (కుప్పిలి)వారి ఇళ్ల వద్ద తొలి పూజ(ఉత్సవం) జరిపి అనంతరం మంగళవారం రాత్రంతా అమ్మవారి ఘటాలతో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని ప్రధానరహదారి వద్ద అమ్మవారికి ఉయ్యాల కంబాలు నిర్వహించి, ఘటాలకు అనుపోత్సవం చేస్తారు.



అమ్మవారి ఘటాలు

నేడు చాటింపు

ఈ నెల 23,24,25తేదీల్లో నిర్వహించనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకుని వచ్చేందుకు బుధవారం చాటింపు వేస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీసభ్యులు, మాజీ ట్రస్ట్‌బోర్డుచైర్మన్లు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొంటారు.

టెన్నికాయిట్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక



టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక మంగళవారం జరిగింది. జిల్లాస్థాయిలో ఎంపికైన అండర్-19 క్రీడాకారులు ఈనెల 11,12 తేదీలలో ఏలూరులో జరగబోయే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారు. సబ్‌జూనియర్స్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11,12 తేదీల్లో అనకాపల్లిలో జరగబోయే పోటీలలో పాల్గొంటారు. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పీఈటీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి.

రైతుల ఆర్థిక అవసరాలు తీరేలా రుణప్రణాళికలు

- బ్యాంకర్లతో జేసీ సమీక్ష



జేసీ మయూర్ అశోక్



పాల్గొన్న బ్యాంక్ అధికారులు, జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: సామాన్య ప్రజలు, రైతుల ఆర్థిక అవసరాలను తీర్చే విధంగా రుణ ప్రణాళికలు రూపొందించాలని జేసీ కే.మయూర్ అశోక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులను కోరారు. జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సభ్యులందరూ హాజరై వివిధ ప్రాజెక్టులకు అందించే రుణాల గురించి, సంబంధిత ప్రతిపాదనలపై జేసీకి వివరించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, డీజీఎం వాసు, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు



చికిత్స పొందుతున్న సింహాచలం



చరణ్‌తేజ

పార్వతీపురం: మండలంలోని వెంకంపేట పంచాయతీ, వసుంధరా నగర్‌కు చెందిన తోయక సింహాచలం గుంజరాడ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన పాఠశాల విధులను ముగించుకుని ఆటోలో ఇంటికి వస్తూ రహదారి దాటుతున్న సమయంలో నర్సిపురం నుంచి పార్వతీపురం వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై తుళ్లిపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలు, తల వెనుకభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టిన వ్యక్తి ధర్మాన చరణ్‌తేజకు కూడా గాయాలయ్యాయి. ఈమేరకు వారిద్దరినీ 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- ఉపాధి కోర్సుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- స్కిల్‌డెవలెప్‌మెంట్ కోర్సుల సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి



స్కిల్ కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ

విజయనగరం అర్బన్: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్‌డెవలెప్‌మెంట్, ఉపాధి కోర్సుల సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్, సీడాప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్.సత్యనారాయణతో కలిసి విజయనగరం టీటీడీసీలోని స్కిల్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లను ఆయన మంగళవారం సందర్శించారు. స్కిల్ కళాశాల, హబ్‌లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. భోజన, వసతి సౌకర్యాలను పరిశీలించారు. శిక్షణ శైలిని పరీక్షించారు. డీఆర్‌డీఏ-సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో టీటీడీసీ మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న డీడీయూ-జీకేవై శిక్షణ ద్వారా (ఎస్ఆర్‌టీపీ) రిటైల్ శిక్షణ పొందుతున్న 35 మంది యువతకు యూనిఫారాలు, శిక్షణకు అవసరమైన వెల్‌కమ్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ కళాశాలలను ఏర్పాటుచేశారన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. శిక్షణలో సాధించిన నైపుణ్యత ఆధారంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం డి.మార్టిన్‌లూథర్, ఏపీఎస్ఎస్‌డీసీ-డీఎస్‌డీఓ గోవిందరావు, రెడాక్స్ దుర్గాప్రసాద్, సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.